ఆర్టీసీ డీపీటీవోగా ఉదయ్ వెంకట్‌మనోహర్

వి.ఎల్.పురం: ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి(ఇన్‌ఛార్జి డీపీటీవో)గా మేడిశెట్టి ఉదయ్‌వెంకట్‌మనోహర్‌ను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కాకినాడ ఇన్‌ఛార్జి డీపీటీవోగా పనిచేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడకు రానున్నారు. ఇప్పటివరకు జిల్లాలో డీపీటీవోగా బాధ్యతలు నిర్వహించిన వై.ఎస్.ఎన్.మూర్తి ఉద్యోగవిరమణ చేశారు. ఈయన స్థానంలో ఇన్‌ఛార్జి డీపీటీవోగా బాధ్యతలు స్వీకరించనున్న ఉదయ్‌వెంకట్ మనోహర్ గతంలో రాజమహేంద్రవరం డిపోలో ఆర్టీసీ కార్గో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(కమర్షియల్)గా, రాజోలు, అమలాపురం, కాకినాడ డీఎంగా పనిచేశారు.

వాడపల్లి క్షేత్రంలో నేటి పూజలు

● కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరుని ఆలయంలో మంగళవారం ఉదయం 5 గంటలకు ప్రభాతసేవ, మేలుకొలుపు, వేంకటేశ్వర సహిత లక్ష్మీఐశ్వర్య హోమం, ద్రవిడ వేదపారాయణం, నివేదన ● 6 గంటలకు గోపూజ, అష్టోత్తర నామార్చన పూజలు, దర్శనాలు ప్రారంభం. ● మధ్యాహ్నం ఒంటి గంట నుంచి విరామం, 4 నుంచి మళ్లీ దర్శనాలు ప్రారంభం. ● సాయంత్రం 6 గంటలకు అర్చన, 7.30 గంటలకు నైవేద్యం. 8 గంటలకు పవళింపు సేవ. – **న్యూస్‌టుడే, అత్రేయపురం**

అయినవిల్లికి పోటెత్తిన భక్తజనం

సంకటహర చతుర్థి పర్వదినం సందర్భంగా సోమవారం అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. పెద్దఎత్తున విచ్చేసి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీ గణపతి హోమంలో పాల్గొన్నారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. వివిధ రుసుముల ద్వారా ఆలయానికి రూ.3,91,368 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. – **న్యూస్‌టుడే, అయినవిల్లి**

సినిమా చెట్టు.. పట్టించుకుంటే ఒట్టు

ఆ మామిడి చెట్టు కింద సీతారామయ్య గారి మనవరాలు వంటి ఎన్నో ఉత్తమ చిత్రాలు రూపుదిద్దుకున్నాయి. ఈ ప్రాంతంలో సినిమా చిత్రీకరణకు వచ్చిన డైరెక్టర్లు సెంటిమెంట్‌గా ఇక్కడ ఒక్కసీన్ అయినా తీయకమానరు. అలాంటిది నేడు నిర్వహణ కరవైంది. స్థానిక బ్యాంక్ కెనాల్ లాకులకు ఆనుకుని ఉన్న ఈ చెట్టు నీటి ఒరవడికి చుట్టూ మట్టి కొట్టుకుపోయింది. వేర్లు బయటపడి ప్రమాదకరంగా ఉంది. గట్టు పటిష్ఠం చేయాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ సాయిమాధవ ప్రసన్న వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. – **న్యూస్‌టుడే, అత్రేయపురం**

సత్యదేవుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యనారాయణ స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్ సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకుని పూజలాచరించిన అనంతరం న్యాయమూర్తి దంపతులకు వేదపండితులు ఆశీస్సులు అందించారు. డిప్యూటీ కమిషనర్ బాబూరావు సత్యదేవుని చిత్రపటం, స్వామి ప్రసాదం అందించారు.

రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలి

నిడదవోలు, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న రుణాలను సక్రమంగా వినియోగించుకుని స్వయం ఉపాధి పొందడంతోపాటు, ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో) వాకాటి కరుణ కోరారు. మండలంలోని పురుషోత్తపల్లిలో పందలపర్రుకు చెందిన శ్రీరామ దుర్గా డ్వాక్రా సంఘ సభ్యురాలు జల్లేపల్లి లక్ష్మీనాగ నిర్వహిస్తున్న మగ్గం వర్క్, బోటిక్ యూనిట్‌ను ఆమె సోమవారం పరిశీలించారు. మహిళా సంఘాల సభ్యులకు రుణ సదుపాయాలు కల్పించడం మాత్రమే కాకుండా వాటిని ఆదాయం సమకూర్చే స్థిరమైన జీవనోపాధి కార్యక్రమాలకు వినియోగించేలా ప్రోత్సహించాలని, ప్రతి సభ్యురాలికి అవసరమైన మేరకు ఏసీఎల్‌పీ ప్రకారం సకాలంలో రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, మహిళా పారిశ్రామికవేత్తల యూనిట్ల గ్రౌండింగ్‌పై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ప్రతి సభ్యురాలు 'మన డబ్బులు-మన లెక్కలు' యాప్‌ను తప్పనిసరిగా చరవాణిలో నమోదు చేసుకుని ఆర్థిక లావాదేవీలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. మహిళలు స్వయం ఉపాధి పొందడంతోపాటు మరికొంత మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా సెర్ప్ సిబ్బంది నిరంతరం మార్గదర్శకత్వం, సహకారం అందించాలని ఆమె సృష్టం చేశారు. లక్ష్మీనాగతో మాట్లాడి యూనిట్ నిర్వహణపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బి.నగేష్, అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు, డీపీఎం ఎల్‌హెచ్ హేమంత్, ఏపీఎం మహాలక్ష్మి, మండల సమాఖ్య అధ్యక్షురాలు నల్లూరి పుష్పావతి, సీసీ మరడాని అరుణ పాల్గొన్నారు.

మగ్గం వర్క్ చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న సెర్ప్ సీఈవో కరుణ

ఆధార్‌కు తాళం వేయడం తెలుసా..?

మీకోసం

న్యూస్‌టుడే, అత్రేయపురం

సైబర్ నేరాల నియంత్రణ, వ్యక్తిగత వివరాల గోప్యతకు ఆధార్‌కు తాళం వేయడం ఎంతో ఉపయోగపడుతుంది. తరచుగా సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలో నిల్వలు ఖాళీ చేస్తున్న ఘటనలు చూస్తున్నాం. అలాంటి నేరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ఆధార్‌పై దృష్టిపెట్టి దాన్ని లాక్ చేసుకోవడం మంచిది. దీనివల్ల మీ వ్యక్తిగత వివరాలు నేరగాళ్ల చేతికి చిక్కవు. అలాగే దుర్వినియోగం చేయడానికి వీలుండదు.

ఏం చేయాలంటే..

ఆధార్‌కు తాళం వేయడానికి మీ చరవాణిని ఉపయోగించుకోవచ్చు. ముందుగా మై ఆధార్ యాప్‌లోకి వెళ్లాలి. హోం పేజీలో కనిపించే ఆధార్ లాక్, అన్ లాక్ యూఐబీ బటన్ ఎంపికచేయాలి. ఆధార్‌లోని 12 అంకెలు, పూర్తి పేరు, పిన్‌కోడ్, సెక్యూరిటీ కోడ్ నమోదు చేయాలి. అనంతరం సెండ్ ఓటీపీపై క్లిక్‌చేస్తే రిజిస్టర్ ఫోన్ నంబరుకు ఓటీపీ వస్తుంది. ఆ నంబర్‌ను నమోదుచేస్తే ఆధార్ లాక్ అవుతుంది.

ఇవీ ఉపయోగాలు..

ఆధార్‌ను లాక్ చేయడంలో వ్యక్తిగత సమాచారం, బయోమెట్రిక్ వివరాలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా సురక్షితంగా ఉంటాయి. మీ ఆధార్‌తో ఎవరైనా సిమ్ కార్డులు తీసుకోవడం, కొత్తగా బ్యాంకు ఖాతా తెరవడం కుదరదు. అలాగే ప్రభుత్వ రాయితీలను దుర్వినియోగం చేసేందుకు అవకాశం ఉండదు. అలాగే ఆధార్ జెరాక్స్ ఇతరుల చేతికి చిక్కినా ఎవరూ ఏమీచేయలేరు. వేలిముద్రలు, కంటిచూపు (ఐరిస్)తో లాక్ చేయడంతో అనుమతి లేకుండా ఎవరూ లావాదేవీలు నిర్వహించడానికి వీలుండదు. ఆధార్‌తో అనుసంధానం చేసిన పాన్‌కార్డు, ఓటర్ గుర్తింపుకార్డు, బ్యాంకు ఖాతాలకు రక్షణ లభిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ సమాచారం బహిర్గతం కాదు. అన్ని విధాలా వ్యక్తిగత వివరాలకు రక్షణ లభిస్తుంది.

ప్రియాంక కేసులో నిందితులకు బెయిల్ నిరాకరణ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): మద్యం మత్తులో రాజమహేంద్రవరంలోని ప్రసాదిత్య మాల్ వద్ద గత నెల 3న పీజీ వైద్య విద్యార్థిని ప్రియాంకను కారుతో ఢీకొట్టి ఆమె మృతికి కారణమైన నిందితులు సురవరపు దస్వంత్, దేశాబత్తుల ఆంధ్రా జోసఫ్ అడ్వర్డ్స్‌కు కోర్టు సోమవారం బెయిల్ నిరాకరించింది. గత నెల 20న రాజమహేంద్రవరం కోర్టులో నిందితులు పిటిషన్ దాఖలు చేయగా 24న విచారణ చేశారు. ఈ మేరకు బెయిల్ తిరస్కరిస్తూ సోమవారం ఆదేశాలిచ్చింది.

ఉత్తమ ఉపాధ్యాయుడి ఎంపిక విధానంపై ఆరోపణలు

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరం మండలంలో ఉత్తమ ఉపాధ్యాయుడి ఎంపికను గుట్టుచప్పుడు కాకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. సాధారణంగా ఉత్తమ ఉపాధ్యాయుడి ఎంపిక ప్రక్రియకు ముందుగా ఓ ప్రకటన జారీ చేయాలి. ఎంపిక కమిటీలో ఎంఈవో-1 ఛైర్మన్‌గా, ఎంఈవో-2 వైస్‌ఛైర్మన్‌గా, ప్రభుత్వ/మండల/యూపీ పాఠశాల నుంచి ఓ హెచ్ఎం, పక్క మండలం నుంచి మరో హెచ్ఎం సభ్యులుగా ఉంటారు. కమిటీ సమావేశమై ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన తర్వాత ఒకరి పేరును ఎంపిక చేసి డీఈవోకు పంపించాల్సి ఉంటుంది. ఈ వ్యవహారం మొత్తం ఎంపీడీవో పర్యవేక్షిస్తుంటారు. కానీ రాజానగరంలో ఇలాంటి విధానం లేకుండానే నచ్చిన వ్యక్తి పేరును సిఫార్సు చేశారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై డీఈవో దృష్టి సారించి, తగిన చర్యలు తీసుకోవాలని సంఘాల సభ్యులు కోరుతున్నారు.

పరీక్షల విధానాన్ని సంస్కరించాలి

ద్రాక్షారామ: పాఠశాలల్లో పరీక్షల విధానాన్ని సమూలంగా సంస్కరించాలని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ వ్యాఖ్యానించారు. రామచంద్రపురం మండలం నరసాపురపుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరీక్షా విధానం మొక్కుబడిగా సాగుతోందని చెప్పారు. పరీక్షలంటే విద్యార్థులు ఎంతవరకు నైపుణ్యం సాధించారో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మరో ముఖ్యఅతిథి మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ విద్య జీవితంలో ఎదగడానికి ఆయుధంలా మారాలని చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యుడినని చెప్పాడు.. పెళ్లంటూ మోసగించాడు

బాధితురాలి ఫిర్యాదుతో వెలుగులోకి ఘరానా మోసగాడి లీలలు

బిక్కవోలు, న్యూస్‌టుడే: తాను వైద్యుడినని, వివాహం చేసుకుంటానని నమ్మబలికి ఒక యువతిని మోసం చేసిన ఘరానా మోసగాడి బండారం బయటపడింది. బిక్కవోలు పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. తొస్సిపూడి గ్రామానికి చెందిన ఓ యువతి కంప్యూటర్ కోర్సు నేర్చుకునే నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. ఆ సమయంలో స్వల్ప అనారోగ్యంతో చికిత్స కోసం అక్కడి నిఖిల్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ నందిగామ రవితేజరెడ్డి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తాను డాక్టర్‌నని, ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. అప్పటికే అతనికి వివాహమై పిల్లలు ఉన్నారనే విషయాన్ని దాచిపెట్టి ఆమెతో మూడేళ్లు సహజీవనం చేశాడు. వివాహ విషయమై పెద్దలతో మాట్లాడాలని ఆమె కోరినా కులాలు వేరు కావడంతో ఇంట్లో అంగీకరించడం లేదని చెప్పాడు. కొన్ని రోజుల తర్వాత తొస్సిపూడి వచ్చి వివాహం చేసుకుంటానని, ఇక్కడే వైద్యునిగా ప్రాక్టీస్ పెడతానని బాధితురాలి తల్లిదండ్రులను నమ్మించాడు. అతని మాటలు నమ్మిన వారు గత ఏప్రిల్ 29న బలభద్రపురం గ్రామంలోని సాయిబాబా ఆలయంలో వివాహం జరిపించారు. వివాహానికి అయిన ఖర్చు సగం తాను భరిస్తానని అప్పట్లో ఆయన చెప్పినా.. పెళ్లికి ముందు తన గదిలోని రూ.20 లక్షలు నగదు, బంగారం తన స్నేహితుడు దొంగిలించాడని అబద్ధం చెప్పి ఖర్చులు ఇవ్వకుండా తప్పించుకున్నాడు. పెళ్లి తర్వాత అత్తవారింట్లోనే కాపురం ఉండేవాడు. అక్కడి నుంచే ఆసుపత్రికి వెళుతూ వివాహ ఖర్చులు త్వరలోనే ఇస్తానని నమ్మించేవాడు.

డబ్బులు ద్విచక్ర వాహనం కవర్‌లో పెట్టానని..

ఆగస్టు 30న రాజమహేంద్రవరంలోని బంధువుల ఇంటికి వెళ్లి వివాహ ఖర్చుల నిమిత్తం రూ.7 లక్షలు తీసుకువస్తానని చెప్పి రవితేజరెడ్డి వెళ్లాడు. అదే రోజు సాయంత్రం బాధితురాలి పెద్దన్నయ్యకు ఫోన్‌చేసి తాను మోటారు సైకిల్‌ను రోడ్డుపక్కన నిలిపి వచ్చేలోగా బైక్ పౌచ్‌లో పెట్టిన నగదును దొంగలు దోచుకున్నారని నమ్మించాడు. దీనిపై అనుమానం వచ్చి ఆయన మండపేట గ్రామీణ సీఐకి ఫిర్యాదుచేయడంతో నిజాలు బయపడ్డాయి. రవితేజరెడ్డి అసలు వైద్యుడే కాదని తేలింది. ఇంటర్ కూడా పూర్తిచేయలేదని తెలిసింది. అప్పటికే అతనికి వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారని, మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని, నగదు కోసం ఆమెను వేధిస్తున్నాడనే విషయాలు వెలుగులోకి వచ్చాయి. బాధితురాలు బిక్కవోలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాజమహేంద్రవరం జైలులో సాధిక్

✦ రేపు కస్టడీ పిటిషన్‌పై విచారణ

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య, అతని అల్లుడు జగదీశ్వర్‌రెడ్డి హత్యకేసులో నిందితుడిగా ఉన్న సాధిక్‌ఖాన్‌ను కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో వేసిన పిటిషన్‌పై ఈ నెల 2న విచారణ జరగనుంది. సుమారు రెండు వారాల కిందట ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరట్‌లో అతడిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాకినాడ కోర్టులో ప్రవేశపెట్టగా ఈ నెల 3 వరకూ రిమాండ్ విధించారు. కొన్ని రోజులు కాకినాడ సబ్‌జైలులో ఉన్న సాధిక్‌ఖాన్‌ను భద్రతా కారణాల రీత్యా జైలు అధికారులు కోర్టు అనుమతితో మూడు రోజుల కిందట రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కు తరలించారు. అతడిని కస్టడీకి ఇస్తే పూర్తిస్థాయిలో విచారణ చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.



డీపీఆర్‌వో రవిని సత్కరించిన కార్యాలయం సిబ్బంది

ఉత్తమ సేవలకు గుర్తింపు

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ విధుల్లో ఉత్తమ సేవలు అందించే సిబ్బందికి గుర్తింపు ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిల్లా పౌరసంబంధాల అధికారి(డీపీఆర్‌వో)గా సేవలు అందించిన పెద్దింటి రవి సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. వైటీసీ ప్రాంగణంలోని డీపీఆర్‌వో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు సిబ్బంది ఆయన్ను సత్కరించారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో డివిజనల్ పీఆర్వో లక్ష్మణాచార్యులు, సహాయ సమాచార ఇంజినీర్ శాంతకుమారి, సిబ్బంది బషీర్, మనోహర్, వర్మ, పద్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాపాయం నుంచి బాలికను కాపాడిన వైద్యులు

భద్రాచలం, న్యూస్‌టుడే: ప్రాణాపాయ స్థితిలో ఉన్న గిరిజన బాలికకు భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి వైద్యులు అత్యవసర వైద్య సేవలు అందించి కాపాడారు. పోలవరం జిల్లా చింతూరు మండలం బొడ్డురాయిగూడెం గ్రామానికి చెందిన ఎస్.వెంకటలక్ష్మి(14) తీవ్ర అనారోగ్యంతో గత నెల 26న ఇక్కడి ఆసుపత్రిలో చేరింది. ఇక్కడ చేరకముందు వారం నుంచి జ్వరం వచ్చి స్థానికంగా చికిత్స పొందింది. ఈ క్రమంలో ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆరు రోజుల కిందట కుటుంబ సభ్యులు ఇక్కడకు తీసుకొచ్చినప్పుడు హిమోగ్లోబిన్ 2 గ్రాములు ఉంది. రక్తం తక్కువగా ఉండటంతో పాటు ఎలక్ట్రోలైట్ లెవల్స్ అసాధారణ స్థితిలో ఉన్నాయి. దీంతో శ్వాస తీసుకోలేక ఇబ్బంది పడింది. మెరుగైన వైద్యం కోసం వేరేచోటికి పంపించేందుకు ప్రయత్నించినప్పటికీ బాలిక కుటుంబ సభ్యుల పరిస్థితి కారణంగా ఇక్కడే ఉంచి అత్యంత క్రిటికల్ కేసుగా గుర్తించి సేవలందించారు. విడతలవారీగా అవసరమైన రక్తం ఎక్కించారు. ఫిట్స్ రాకుండా జాగ్రత్తలు పాటించారు. రక్తంలో షుగర్ స్థాయిలను నియంత్రించి కామెర్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. రెస్పిరేటరీ సపోర్ట్ వంటి చికిత్సలను అందించడంతో బాలిక ఆరోగ్యం కుదుటపడింది. నిపుణులైన ప్రభుత్వ వైద్యులపై ఆ కుటుంబం ఉంచిన నమ్మకంతో ఇది సాధ్యమైందని కోలుకున్న బాలికను సోమవారం డిశ్చార్జి చేశామని సూపరింటెండెంట్ డా.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ వైద్య సేవలు అందించిన పిల్లల వైద్యుడు డా. క్రాపా విజయ్, నర్సింగ్ సిబ్బంది డా. రాజ్యలక్ష్మిలను అభినందించారు.

యువతిని మోసం చేసిన కేసులో.. మాజీ కానిస్టేబుల్‌కు జైలు, జరిమానా

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన కేసులో మాజీ పోలీస్ కానిస్టేబుల్‌కు కోర్టు 12 ఏళ్ల 3 నెలల జైలు శిక్ష, రూ.7వేలు జరిమానా విధించింది. కేసు వివరాలను ఎస్పీ రాహుల్ మీనా సోమవారం వివరించారు. రాజానగరం పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ చదువుతున్న యువతికి 2022లో మలికిపురం మండలం లక్కవరం గ్రామానికి చెందిన కానిస్టేబుల్ ఉండ్రు అభిషేక్ (29) ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయ్యాడు. తనకు అర్థమెటిక్ సబ్జెక్ట్ తెలుసునని స్టడీ మెటీరియల్ ఇస్తానని పరిచయం చేసుకున్నాడు. తనను పెళ్లిచేసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి బలవంతంగా తాళి కట్టాడు. శారీరకంగా దగ్గరైన తర్వాత మోహం చాటేశాడు. దీనిపై ఆ యువతి 2023, ఏప్రిల్ 17న అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ దుర్గాశేఖర్‌రెడ్డి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. అనంతరం సీఐ టి.క్రాంతికుమార్ కోర్టులో ఛార్జ్‌షీట్ వేశారు. నిందితుడిని 2024లో ఉద్యోగం నుంచి తొలగించారు. రాజమహేంద్రవరం కోర్టులో పీపీలు కె.రాధాకృష్ణరాజు, తుమ్మల వాసులు వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో 8వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి బి.నిర్మల తీర్పు చెప్పారు. పట్టణ సీఐ వీరబాబు, డీఎస్పీ టీఆర్ఎస్‌కే ప్రసాద్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ డి.మురళి, కోర్టు కానిస్టేబుల్ సురేష్‌ను అభినందించారు.

మహిళపై హత్యాయత్నం కేసు.. వీఆర్‌కు నలుగురు పోలీసులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): కోరుకొండ మండలంలోని గాడాలలో బొమ్మూరుకు చెందిన ధనలక్ష్మిపై హత్యాయత్నం చేసిన ఇద్దరు అన్నదమ్ముల కేసులో నలుగురు పోలీసులను సోమవారం వీఆర్‌కు పంపుతూ ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆదేశాలిచ్చారు. గత నెల 26న ఘటన వెలుగులోకి వచ్చినా 30వ తేదీ వరకు కేసు నమోదుకు జాప్యం జరగడంపై కోరుకొండ ఎస్సై రమేష్, ఆసుపత్రి ఎంఎల్‌సీ కోరుకొండ పోలీసుస్టేషన్‌కు చేరవేయడంలో అలసత్వం వహించిన జీజీహెచ్ అవుట్‌పోస్టు ఏఎస్సై శ్రీదేవి(రెండో పట్టణ), హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మణ్(సీతానగరం), నాగమల్లేశ్వరరావు (మండపేట పట్టణ)లను వీఆర్‌కు పంపినట్లు తెలిసింది. వీరిపై ఉత్తర మండల డీఎస్పీ జీవన ఆధ్వర్యంలో విచారణ జరుగుతుందని.. నివేదిక ఆధారంగా చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.

ప్రపంచ కొబ్బరి దినోత్సవం రేపు

అంబాజీపేట: ప్రపంచ కొబ్బరి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 2న అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రంలో వేడుకలు నిర్వహించనున్నట్లు ముఖ్య శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి పి.అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 4.15 గంటల వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, కోస్టల్ జోన్-1 డి.వెంకటస్వామి, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఎస్.సూర్యకుమారితో పాటు పలువురు శాస్త్రవేత్తలు పాల్గొని కొబ్బరిపంట ఉత్పత్తి పెంపు, సాంకేతికతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, తోటల సాగు, తెగుళ్లు, పురుగుల నివారణ తదితర అంశాలపై చర్చిస్తారని ఆయన వెల్లడించారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ.లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	16,000
పాతకాయ: గండేరా	23,500
గటగట	21,000
కొత్తకాయ: గండేరా	23,000
గటగట	20,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	19,000-21,000
కొత్త (పచ్చి) కాయ	20,000-21,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ.లలో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	147-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	257-00

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రామవరం బ్రాంచి (09411)
రామవరం, అనపర్తి మండలం, తూర్పు గోదావరి జిల్లా-533264.
Cell: 9550040563,
email: ubin0809411@unionbankofindia.bank.in

ఈ వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 & 9 నిబంధనతో పాటు చదవబడిన సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 కింద స్థిరాస్తుల అమ్మకానికి ఈ-వేలం అమ్మకపు నోటీసు.

ఈ నోటీసు ద్వారా ప్రత్యేకించి ఋణగ్రహీత(లు) / తనఖాదారు(లు) / హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయునది ఏమనగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రామవరం బ్రాంచి (09411), కు తనఖా/ఛార్జ్ చేయబడిన, దిగువ వివరించబడిన స్థిరాస్తులను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు. దిగువ స్థిరాస్తులను ఈ-వేలం అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతల నుండి రావలసిన దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఖర్చులు/ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు రాబట్టుకొనేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారిచే ఈ-వేలం అమ్మకం ద్వారా **దీ. 17.09.2026** న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. బిడ్లు సమర్పించుటకు ఆఖరు తేది: ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు.

ఈ వేలం తేది మరియు సమయం: 17.09.2026, మ॥ 12.00 గం. నుండి సా॥ 05.00 గం. వరకు (10 నిల॥ అపరిమిత స్వీయ పొడిగింపులతో)

ఋణగ్రహీతలు మరియు హామీదారు పేర్లు మరియు చిరునామా: ఋణగ్రహీతలు: 1. శ్రీ పెదపాటి వెంకట రమణ, తండ్రి: సత్యనారాయణ, డి.నెం: 1-92, పల్లపు వీధి, కుతుకులూరు గ్రామం, కుతుకులూరు, అనపర్తి మండలం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-533264. **2. శ్రీమతి పెదపాటి వెంకట లక్ష్మి,** భర్త: వెంకట రమణ, డి.నెం: 1-92, పల్లపు వీధి, కుతుకులూరు గ్రామం, కుతుకులూరు, అనపర్తి మండలం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-533264. **కో-అప్లిగెంట్: 3. శ్రీ పెదపాటి సత్యనారాయణ,** తండ్రి: వెంకట రావు (లేట్), డి.నెం: 7-25, సబ్బెళ్ళ వారి వీధి, కుతుకులూరు గ్రామం, కుతుకులూరు, అనపర్తి మండలం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-533264.

బకాయి మొత్తం: రూ. 7,81,641.15 (అక్షరాలా ఏడు లక్షల ఎనభై ఒక్క వేల ఆరు వందల నలభై ఒకటి మరియు పదిహేను పైసలు మాత్రమే) + కూడిన వడ్డీతో పాటు తదుపరి వడ్డీలు, ఖర్చులు మరియు ఛార్జీలు మరియు దానిపై వడ్డీ.

స్థిరాస్తి వివరములు

షెడ్యూల్: ఏపి, తూర్పు గోదావరి జిల్లా, అనపర్తి మండలం, కుతుకులూరు గ్రామం, 5వ వార్డులో గల ఆర్‌ఎస్ నెం. 428/2లో డోర్ నెం. 5-73కి సమీపంలో ఉన్న ఆస్తి పశ్చిమ వైపు 104 చదరపు గజాలలో నిర్మించబడిన ఆర్‌సిసి రూఫ్డ్ గ్రౌండ్ మరియు మొదటి అంతస్తు నివాస భవనం ఉంది. ఈ స్థలం మరియు భవనంతో పాటు దానికి సంబంధించిన సులభ హక్కులు మరియు అన్ని భౌతిక హక్కులు శ్రీ పెదపాటి వెంకట రమణ, తండ్